

కిటకిటలాడుతున్న కేఆర్ మార్కెట్


వ్యాపారులకు పండగే

● వరమహాలక్ష్మి వ్రతం సందర్భంగా కేఆర్ మార్కెట్ కిటకిట

7



నమ్మ మెట్రో ఎల్లో లైన్



- 19 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి
- 10న జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ
- 16 స్టేషన్‌లు..
- 25 నిమిషాల ప్రయాణం
- పాతికవేల మందికి అనుకూలం
- మరో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని

ఎలక్ట్రానిక్ సిటీకి మెట్రో పరుగులు

బెంగళూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో చారిత్రాత్మకం అనిపించే మరో మెట్రో మార్గం ప్రజలకు అనుకూలం అవుతోంది. నగరానికి విశ్వవ్యాప్తంగా పేరొచ్చిన ఐటీ నగరి అనేందుకు మూలాధారమైన ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతానికి మెట్రో రైలు పరుగులు తీయనుంది. ఐటీ కారిడార్‌లో ఒక్కటైన ఎలక్ట్రానిక్‌సిటీకి వెళ్లేందుకు సులభతరం కానుంది. నమ్మమెట్రో ఎల్లోలైన్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 10న లాంఛనంగా జాతికి అంకితం చేయనున్నారు. నగర ప్రజలు ఆత్రుతతో ఎదురుచూస్తున్న ఎల్లోలైన్ మెట్రో మార్గంలో సంచారానికి స్వాతంత్ర్యదినోత్సవం నుంచి వీలు కల్పిస్తున్నారు. ఈ మార్గంలో 15 మెట్రో రైళ్లు సంచరించనున్నాయి. ప్రస్తుతం బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) స్వీకరించిన 3 కోచ్‌ల రైలు ప్రారంభంలో అందుబాటులోకి రానున్నాయి. అనంతరం కోచ్‌ల సంఖ్య పెరగనుంది. 2026 మార్చి నాటికి సంపూర్ణంగా మెట్రోబోగీలు అందుబాటులోకి వస్తాయి. ప్రారంభంలో రోజుకు 25వేలమంది ప్రయాణీకులకు అనుకూలం కానుందని భావిస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే మెట్రో రైళ్లకు లోకో పైలట్‌లు ఉండరు. ఉదయ 5 గంటలనుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో సంచారం ఉంటుంది.

రెండు రాష్ట్రాలకు ప్రయోజనం

గడిచిన మూడేళ్లుగా ఈ మార్గంలో ప్రజల సంచారానికి అనుకూలం చేసేందుకు బీఎంఆర్‌సీఎల్ కసరత్తు జరిపింది. అయితే పనుల జాప్యం, బోగీల రవాణాలో తీవ్రమైన ఆలస్యంతోపాటు పలు కారణాలతో వాయిదాలు పడుతూ వచ్చింది. బెంగళూరులో ఐటీ, పారిశ్రామిక హబ్‌లు కల్గిన ఎలక్ట్రానిక్‌సిటీ, బొమ్మసంద్రలలోని వందలాది పరిశ్రమలలో పనిచేసేవారికి ఈ మెట్రో మార్గం అనుకూలం కానుంది. ఈ మార్గంలో ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతంలో ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీతోపాటు పలు ఎంఎన్‌సీలు ఉన్నాయి. ఇక బొమ్మసంద్ర పారిశ్రామిక వాడలో వందలాది భారీ పరిశ్రమలు నెలకొన్నాయి. అనుబంధ యూనిట్‌లతో కలిపితే లక్షలాది మంది ఈ ప్రాంతంలో పనిచేస్తుంటారు. వీటితోపాటు ప్రధానమైన ఆసుపత్రులు ఉన్నాయి. నగరానికి వివిధ ప్రాంతాల నుంచి బస్సు, రైళ్లలో వచ్చేవారు ఎలక్ట్రానిక్‌సిటీ మార్గంలోని ఆసుపత్రులకు వెళ్లాలంటే క్యాబ్ లేదా బస్సులలో మాత్రమే వీలుండేది. ఇక్కడ ట్రాఫిక్‌తో కనీసం 30 కిలోమీటర్ల ప్రయాణానికి 2 గంటలకుపైగా సమయం పట్టేది. దీనికితోడు తమిళనాడు రాష్ట్ర సరిహద్దు బొమ్మసంద్రకు ఆరేడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. మరో 15 కిలోమీటర్ల దూరంలో తమిళనాడులోని హోసూరు నగరం ఉంది. హోసూరు ప్రాంతంలోనూ భారీ పారిశ్రామికవాడ ఉంది. ఇలా ఎక్కువమంది బొమ్మసంద్ర, హోసూరు ప్రాంతంలోని పారిశ్రామికవాడలలో పనిచేసేవారు రోడ్డు మార్గంలోనే వెళ్లేవారు. గంటల తరబడి ప్రయాణించాల్సి ఉండేది. ఇక వర్షాకాలంలో మరింత సమస్య అయ్యేది. జాతీయ రహదారి ఉండడంతో భారీ వాహనాల సంచారం కూడా ఈ మార్గంలో సమస్యగా ఉండేది.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఎలక్ట్రానిక్ సిటీ మెట్రో స్టేషన్

96 కిలోమీటర్లకు విస్తరించిన మెట్రో

బెంగళూరులో ప్రప్రథమంగా మెట్రో సంచారం 2011లో ప్రారంభమైంది. తొలిసారిగా ఎంజీ రోడ్డు నుంచి బయ్యప్పనహళ్ళి వరకు 6 కిలోమీటర్ల మేర మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆ తర్వాత గ్రీన్‌లైన్ మార్గాలతో కలిపి ప్రస్తుతం రెండు మార్గాలలో 76.95 కిలోమీటర్లు మెట్రో సౌలభ్యం వచ్చింది. ప్రస్తుతం ఎల్లోలైన్ ద్వారా 19.15 కిలోమీటర్ల చేరడంతో 96.10 కిలోమీటర్లకు పెరగనుంది. వచ్చే ఏడాది కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో సేవలు ప్రారంభమైతే 150 కిలోమీటర్లకు చేరనుంది.

మూడో విడత ప్రాజెక్టుకు శంకుస్థాపన

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎల్లోలైన్ మెట్రో సేవలను జాతికి అంకితం చేసేవేళ మూడో విడత మెట్రో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. 44.65 కిలోమీటర్ల పొడవుతో ఈ ప్రాజెక్టుకు రూ.15,611 కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో జేపీనగర్ 4వ స్టేజ్ నుంచి రింగ్‌రోడ్డు మీదుగా హెబ్బాళ చేరనుంది. ఈ మార్గం 32.15 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 22 రైల్వేస్టేషన్‌లు నిర్మించనున్నారు. మరో మార్గంలో విజయనగర హోసహళ్ళి నుంచి మాగడి రోడ్డు మీదుగా కడబగెరె వరకు నిర్మించనున్నారు. ఈ మార్గం 12.5 కిలోమీటర్లు దూరం ఉంది.

16 స్టేషన్‌లు ఇవే..

ఆర్‌వీ రోడ్డు, రాగిగుడ్డ ఆలయం, జయదేవ ఆసుపత్రి, బీటీఎం లే అవుట్, సిల్క్‌బోర్డు, బొమ్మనహళ్ళి, హొంగసంద్ర, కూడ్లుగేట్, సింగసంద్ర, హోసరోడ్డు, బెరటేన అగ్రహార, ఎలక్ట్రానిక్‌సిటీ, ఇన్ఫోసిస్ (కోనప్పన అగ్రహార), హుస్కూరు, హెబ్బగూడి, బొమ్మసంద్ర.



రాగిగుడ్డ మెట్రో స్టేషన్

19.15 కిలోమీటర్ల దూరం

మెట్రో ఎల్లో మార్గంలో 16రైల్వేస్టేషన్‌లు ఉండగా 19.15 కిలోమీటర్ల పొడవుంది. ఆర్‌వీ రోడ్డు నేషనల్ యూనివర్సిటీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర పారిశ్రామికవాడదాకా మెట్రో సంచారం ఉంటుంది. ప్రతిష్టాత్మకమైన జయదేవ హృద్రోగసంస్థతోపాటు దశాబ్దాలకాలంగా ట్రాఫిక్ రద్దీకి సంకేతంగా ఉండే సెంట్రల్ సిల్క్‌బోర్డ్, ఇన్ఫోసిస్ కంపెనీ, ఐటీహబ్ ఎలక్ట్రానిక్‌సిటీ, పారిశ్రామికకేంద్రమైన హెబ్బగూడి, బొమ్మసంద్ర ప్రదేశాలకు అనుకూలం కానుంది. ప్రస్తుతం రోడ్డుమార్గంగా వెళ్లాలంటే గంటన్నర నుంచి రెండు గంటలు పడుతుంది. ట్రాఫిక్‌జామ్ అయితే ఎంత సమయం పడుతుందో చెప్పడం సాధ్య కాదు. అయితే మెట్రో ద్వారా ప్రయాణిస్తే కేవలం 25 నిమిషాలలోనే చేరుకోవచ్చు. సమయం ఆదాతో పాటు ఇంధనం కూడా పొదుపు కానుంది. ఎల్లోలైన్‌లో 3 ఇంటర్‌చేంజ్‌లు ఉన్నాయి. గ్రీన్, బ్లూ, పింక్ మార్గాలు ఉన్నాయి. గ్రీన్‌లైన్‌లో ఆర్‌వీ రోడ్డు రైల్వేస్టేషన్, బ్లూలైన్‌లో సిల్క్‌బోర్డ్, పింక్‌లైన్‌లో జయదేవ ఆసుపత్రి స్టేషన్‌లో ప్రయాణికులకు ఇంటర్‌చేంజ్ సదుపాయం ఉంది.

● ఎల్లో లైన్ మెట్రో సేవల్లో ఆర్‌వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర దాకా అందుబాటులోకి రానుంది. మొత్తం 19.15 కిలోమీటర్లు మేర ప్రయాణించేందుకు వీలుంది. ప్రయాణ సమయం 25 నిమిషాలుగా ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణాలకు 5,056.99 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ప్రయాణికులు ప్రారంభంలో రోజుకు 25వేలమందికి అనుకూలం కానుండగా పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి వస్తే 3లక్షలమంది రోజూ ఉపయోగించుకోనున్నారు.

వైద్యం బాగా చేస్తున్నారా..?

● సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది..? ● విక్టోరియా ఆసుపత్రి రోగులను అడిగిన సీఎం

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్లు బాగా చూస్తున్నారా..? ప్రమాదం ఎలా జరిగింది..? జాగ్రత్తలు లేకుంటే ఎలా.. అంటూ సీఎం సిద్దరామయ్య రోగులను ఒక్కొక్కరిని ఆప్యాయంగా పరామర్శించారు. బుధవారం ముఖ్యమంత్రితోపాటు వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్, అధికారులతో కలసి విక్టోరియా ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ వార్డుల్లో రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాణివిలాస్ ఆసుపత్రి విభాగాన్ని సందర్శించారు. అక్కడి డాక్టర్లు రోజూ 40దాకా కాన్పులు జరుగుతాయని సీఎంకు వివరించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న పలువురితో మాట్లాడారు. అవయవదానానికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో 30-40 లక్షల రూపాయలదాకా ఖర్చు అవుతుందని, ఇక్కడ ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు వివరించారు. 108 అంబులెన్స్ మరికొన్ని రోజులలో ప్రభుత్వమే కొనసాగించనుందన్నారు. 120 పడకల ఆసుపత్రిని 300కు పెంచాలనే ప్రస్తావన ఉందని, పరిగణిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో పర్యటన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పలు విభాగాలలో రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నానని సీఎం తెలిపారు. ఆసుపత్రిలో ఇబ్బందులు ఎవరూ తెలపలేదన్నారు. తొలుత షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి బుధవారం కొప్పళ జిల్లాలో పర్యటించాల్సి ఉండేది. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో విమానంలో పర్యటించడం సాధ్యం కాదని రద్దు చేసుకున్నారు. దీంతో విక్టోరియా ఆసుపత్రిని సందర్శించారు.



ఆసుపత్రిలో రోగిని పరామర్శిస్తున్న సీఎం సిద్దరామయ్య

రేపటి రాహుల్ పర్యటనకు అంతా సిద్ధం

● ఏర్పాట్లు పరిశీలించిన డీసీఎం, ఇన్‌చార్జ్ సుర్జేవాలా

● భారీ జనసమీకరణకు నేతల యత్నం



ఫ్రీడం పార్కులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సుర్జేవాలా, డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యంపై కాంగ్రెస్ పార్టీ నిరసనకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. 8న శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే నిరసనకు పార్టీ ముఖ్యనేత రాహుల్‌గాంధీ వస్తున్నారు. ఇందుకోసం ఫ్రీడంపార్కులో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం డిల్లీ నుంచి హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి చేరుకునే రాహుల్‌గాంధీ అక్కడనుంచి నేరుగా ఫ్రీడంపార్కుకు చేరుకుంటారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చౌర్యం జరిగిందని, బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోనూ అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే నిరసన ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గేతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యులు హాజరు కానున్నారు. బెంగళూరుతో సంబంధం లేకుండా నగరానికి సమీపంలోని 11 శాసనసభ నియోజకవర్గాలనుంచి పార్టీ కార్యకర్తలను నిరసనలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవానికి 5న మంగళవారం నిరసన జరిపేలా ఏర్పాట్లు చేశారు. జార్ఖండ్ మాజీ సీఎం శిబు సొరేన్ మృతితో నిరసనను వాయిదా వేశారు. శుక్రవారం వరమహాలక్ష్మివ్రతం ఉన్నా పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరవుతారని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుపుకొనే తొలి పండుగ కావడంతో ఊహించినంత మేర కార్యకర్తలు తరలివస్తారా..? అనేది పార్టీలో సందేహం ఉంది. ఫ్రీడం పార్క్‌లో ఏర్పాట్లను డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాలు బుధవారం సాయంత్రం పరిశీలించారు. గురువారం పార్టీ ముఖ్యనేతలతో సమావేశం ఉంటుందని డీకే తెలిపారు.

వాగుదాటి.. వల్లకాటికి..!

● ముకుందలో అంత్యక్రియలకు ఇబ్బందులు

రాయచూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో 'చావు' కష్టాలు మామూలుగా లేవు. జిల్లాలోని సింధనూరు తాలూకా ముకుంద గ్రామ ప్రజలు వర్షకాలంలో విచిత్రమైన సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామానికి సంబంధించిన శ్మశాన వాటిక ఒకటి తుంగభద్ర నది మధ్యలో ఉండడంతో ఈ సమస్య వారి ప్రతి ఏటా పరిపాటిగా మారింది. తుంగభద్ర జలాశయం నుంచి నీటిని భారీ పస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో నడిగడ్డలో ఉన్న శ్మశానానికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు గత్యంతం లేక గ్రామస్థులు మృతదేహాన్ని పడవలో ఎక్కించుకుని నది దాటే దుస్థితి ఉంది. ప్రతి ఏటా తమకు ఈ పరిస్థితి తప్పదని అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రత్యేమ్నాయం చూపడం లేదంటు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన వృద్ధుడొకరు మృత్యువాతపడగా అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు మృతదేహాన్ని ఉంచుకుని బంధువులు, కుటుంబ సభ్యులు నదిలో దాటుతున్న వీడియో చూసి పలువురు చలించిపోతున్నారు. అధికారులు కనీసం తాత్కాలిక వంతెన అయినా నిర్మించాలని కోరుతున్నారు.



మృతదేహంతో వాగు దాటుతున్న గ్రామస్థులు

బిజీ అయినారు

● వరి నాట్లతో కూలీలకు పెరిగిన డిమాండ్

● అమాంతం పెరిగిన ధరలతో రైతులు విలవిల



నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌తో నారు తీసుకెళుతున్న కూలీలు

కంప్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ ఆయకట్టులో వరినాట్లు జోరందుకోవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. బళ్లారి, విజయనగరం జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు వరి నాటుకుంటున్నారు. ఒకే సారి రైతులు కూలికి పిలవడంతో ధరలు పెంచేసినట్లు తెలుస్తోంది. గతంలో ఎకరానికి రూ. 2500 నుంచి రూ. మూడు వేలు పలికేది. ఇప్పుడు మూడు చోట్ల నాట్లు జోరందుకోవడంతో రూ. 3500ల నుంచి రూ. 4500 వరకు డిమాండ్ పలుకుతోంది. అయినా రైతులు లెక్క చేయకుండా వేరే గ్రామాలకు వెళ్లి వారికి ప్రత్యేకించి రవాణాకు ఆటోల ద్వారా తీసుకొచ్చి నాట్లు వేయిస్తున్నారు. రైతు కుటుంబరావు హనుమప్ప మాట్లాడుతూ యేడాది ప్రస్తుతానికి ఎరువుల ధరలు ఆకాశం తాకాయన్నారు. అసలే ధరలు లేక వరిరైతులు నష్ట పోయామని, పెరిగిన ధరలతో మరిన్ని అవస్థలు తప్పడం లేదన్నారు.



కంప్లి వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

విరూపాక్షేశ్వరుడి సన్నిధిలో గవర్నర్




హంపిలో గవర్నర్‌ను ఆశీర్వదిస్తున్న గజరాజు

హోస్పేట/బళ్లారి సిటీ ఆగస్టు6:(ఆంధ్రజ్యోతి): హంపి విరూపాక్షేశ్వర స్వామి ఆలయాన్ని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ బుధవారం కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు గజరాజుతో పూలమాల వేయించి స్వాగతం పలికారు హంపిలోని ఉగ్రనరసింహ విగ్రహాన్ని సందర్శించారు. తుగభద్ర జలాశయాన్ని సందర్శించి ఆనందించారు. అనతరం అంజనాద్రిలో పర్యటించి హనమంతుడిని దర్శించుకున్నారు. అనంతరం 30 నిమిషాల్లో అంజనాద్రి 576 మెట్లు దిగి అందరినీ ఆశ్చర్యపరిచారు. గవర్నర్ మంగళవారం హొసపేట వైకుంఠ అతిథి గృహంలో ఆయన బస చేశారు. విజయనగరం జిల్లా కమిషనర్ ఎంఎస్ దివాకర్, కొప్పల్ జిల్లా కమిషనర్ సురేష్ బి ఇట్నాల్ సి ఈఓ వర్నిత్ నేగి, ఎస్పీ రామ్ ఎల్ ఆర్ సిద్ధి హాజరయ్యారు.



అంజనాద్రి హనుమంతుడి ఆలయం వద్ద..

నిధులను పెంచండి: ఎంపీ అంబికా


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యులకు ఏడాదికి కేటాయించే నిధులను పెంచడంతోపాటు జీఎస్టీని మినహాయించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం 377 నిబంధనలో భాగంగా ఎంపీ పార్లమెంట్ సమావేశంలో మాట్లాడారు. 2011 నుంచి ప్రతి పార్లమెంట్ సభ్యుడికి ఏడాదికి కేటాయించే (ఎంపీ లాడ్స్) రూ.5 కోట్ల నిధులు ప్రస్తుత రోజుల్లో ద్రవ్యోల్బణం, నిర్మాణ వ్యయాలు, ప్రజా అవసరాల పెరుగుదలతో సరిపోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, రహదారుల లేమి తదితర సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏడాదికి కేటాయించే రూ.5 కోట్ల నిధులు ప్రాథమిక అవసరాలకే సరిపోవడం లేదని ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్రం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాల తరహాలోనే ఎంపీ నిధుల ద్వారా చేపట్టే పనులకు జీఎస్టీ మినహాయిం పు కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రతి ఎంపీకి ఏడాదికి రూ.10 కోట్లు నిధులు కేటాయించడంతోపాటు జీఎస్టీని పూర్తిగా మినహాయించా లని విజ్ఞప్తి చేశారు.

సికింద్రాబాద్-మైసూర్ ప్రత్యేక రైలు



గుంతకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి సికింద్రాబాదు- మైసూర్-సికింద్రాబాద్ (వయా గుంతకల్లు) ప్రత్యేక బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ ను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాదు-మైసూర్ బైవీక్లీ ప్రత్యేక రైలు (07033) ఈ నెల 8 నుంచి 29 వరకూ సోమ, శుక్రవారాలలో నడపనున్నారు. ఆయా రోజుల్లో సికింద్రాబాదులో రాత్రి 10-10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు మైసూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (07034) ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకూ బుధ, శనివారాలలో నడుస్తుందన్నారు. ఆయా రోజుల్లో సాయంత్రం 5-20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాదుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యల్హంక, బెంగళూరు కంటోన్మెంటు, కేఎస్ఆర్ బెంగళూరు, కనిగెరి, మండ్య స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుతుందన్నారు.

మస్కా కొట్టిన మాయగాళ్లు

ఓ వ్యక్తిని ఏమార్చి మూడు తులాల బంగారం కాజేసిన దుండగులు

డీ.హీరేహాళ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సహాయం చేస్తున్నట్లు నటించి ఓ వ్యక్తి నుంచి మూడు తులాల బంగారాన్ని కాజేసిన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక రాంపురం పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ ఆంజనేయులు రాయదుర్గానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ తరుణంలో మండలంలోని పాతహడగలి గ్రామం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆంజనేయులును ఆపారు. 'సార్..! ఈ ప్రాంతంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ ఒంటి మీద ఉన్న బంగారం మొత్తం తీసి జాగ్రత్తగా ఒక పేపర్‌లో పెట్టుకుని వెళ్లండి' అని చెప్పారు. ఇది నమ్మిన ఆంజనేయులు తన ఒంటి మీద ఉన్న ఒక చైను, రెండు ఉంగరాలను తీశాడు. ఈ సమయంలో ఆంజనేయులుకు సాయం చేస్తున్నట్లు నటించి, ఆ బంగారాన్ని పేపర్లో మడిచి ఆయన ద్విచక్ర వాహనంపై ఉన్న బ్యాగులో ముందువైపు పెట్టి పంపించేశారు. కొంతదూరం వెళ్లిన ఆంజనేయులు అనుమానంతో ఆ పేపర్‌ను విప్పి చూడగా అందులో చిన్న చిన్న రాళ్లగుళికలు ఉండటం గమనించాడు. వెంటనే తిరిగి సంఘటనా స్థలానికి వచ్చి చూడగా అక్కడ ఎవరూ లేకపోవడంతో కంగారుపడ్డాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. మొత్తం మూడు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.

ఫ్రీ బస్సుకు చురుగ్గా చర్యలు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు


అధికారులకు సూచనలు చేస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఈ నెల 15 నుంచి కల్పించేందుకు చురుగ్గా చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఆర్ఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణం పథకాన్ని మహిళలకు పూర్తి లబ్ధిదాయకంగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి బస్సు షెడ్యూల్, రూట్ మ్యాపింగ్, టిక్కెట్ విధానం, డిజిటల్ ట్రాకింగ్ వంటి అంశాలపై పూర్తి స్పష్టత ఉండాలన్నారు. అనంతరం బస్టాండుతోపాటు డిపో పరిసరాలను ఆయన సందర్శించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపాలన్నారు. బస్టాండు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బస్టాండు మేనేజర్ కేఎన్ మూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 732 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురంరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠ ధర రూ.30, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు.

రాయితీలకు మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): చేనేతలకు పలు రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఈ-క్యాబినెట్ భేటీలో చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించే పథకానికి ఆమోదం తెలిపింది. చేనేత ఉత్పత్తుల జీఎస్టీపై రాయితీ ఇవ్వనుంది. త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్.. కింద చేనేత వస్త్రాలకు రాష్ట్రానికి 10 అవార్డులు లభించగా.. మొదటి సారిగా ధర్మవరం పట్టు చీర రాష్ట్ర అవార్డులు గెలుచుకుంది. పుట్టపర్తిలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును రెగ్యులర్ ప్రాతిపదికన నియమించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

అమ్మా.. ఇక సెలవ్..!

- హరితా క్షమించు... నా టైం ఇక్కడితో అయిపోయింది..
- రూ.35 వేలకు రూ.1.20 లక్షలు కట్టా.. ఇక కట్టలేను..
- సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి ఆవేదన
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య
- బ్యాంకులోనే ఉరి
- అప్పుల వేధింపులు అంటూ సూసైడ్ నోట్


రోదిస్తున్న రవికుమార్ భార్య హరిత, కుటుంబీకులు

'అమ్మా.. ఇక సెలవ్. హరితా నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభం లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపం అయ్యాయి. నా టైం ఇక్కడితో అయిపోయింది. రూ.50 వేలు అప్పు తీసుకుంటే... రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. ప్రతి నెలా రూ.15,000 ఇచ్చాను. వడ్డీ కడుతూ ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాను. ఇంక నా వల్ల కాదు.'

ఇవీ అప్పుల బాధలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ప్రాణం తీసుకున్న బ్యాంకు ఉద్యోగి రాసుకున్న ఆఖరి మాటలు. రూ.35 వేలు తీసుకుంటే... ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాడంటే.. వడ్డీ వ్యాపారులు ఏ స్థాయిలో వసూళ్లు చేశారో చెప్పనక్కర్లేదు.


ఉద్యోగి రవికుమార్ (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తి రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి రవికుమార్ (40) అప్పుల బాధలు భరించలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకులోనే ఉరేసుకుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలులోని సీ క్యాంపు ప్రాంతానికి చెందిన సంకుల రవికుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి స్థానిక వినాయకనగర్‌లో స్థిరపడ్డాడు. భార్య హరిత, పిల్లలు సూర్యతేజ(13), దీక్షిత(11), వీక్షిత (10) ఉన్నారు. 12 ఏళ్లుగా బ్యాంకులో సబ్ స్టాఫ్(దస్తరీ)గా పనిచేస్తుండేవాడు. బుధవారం ఉదయం 9.45 గంటలపుడు బ్యాంకుకు వెళ్లాడు. కాసేపు అక్కడి ఉద్యోగులతో మాట్లాడాడు. అంతకుముందు భార్యకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పాడు. తర్వాత 9.50గంటలకు బ్యాంకులోని వాష్ రూమ్‌కు వెళ్లి కిటికీకి కొత్తగా తెచ్చుకున్న నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. వాష్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో గుర్తించిన బ్యాంకు సిబ్బంది, ఇంటికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కార్పెంటర్ ఓపెన్ చేసి చూడ గా... ఉరివేసుకుని, మరణించాడు. సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ శాంతిలాల్, వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వేధింపులే..

రవికుమార్‌ను అప్పులు, అధిక వడ్డీ వేధింపులే బలి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. 35 వేలకు ఇప్పటికే రూ.1.20 లక్షలు కట్టాననీ, ఇక కట్టలేనంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొనడం చూస్తేంటే.. వడ్డీలు కట్టడానికి జీతం చాలట్లేదని స్పష్టమవుతోంది. మరికొందరి వద్ద తీసుకున్న అప్పులు కూడా అతడికి భారంగా మారినట్లు స్పష్టమవుతోంది. రవికుమార్ మూడు రోజులపాటు సెలవు తీసుకున్నాడని బ్యాంకు సిబ్బంది ద్వారా తెలుస్తోంది. సెలవు ముగించుకుని వచ్చీ రాగానే... బ్యాంకు ఉద్యోగులు, కుటుంబీకులను ఒకసారి మాట్లడించి, అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. రవికుమార్ మృతదేహాన్ని వాష్ రూమ్ నుంచీ బయటకు తీయగానే... భార్య హరిత, ఇతర కుటుంబీలు కన్నీరుమున్నీరయ్యారు. తోటి బ్యాంకు ఉద్యోగులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. కొందరు ఉద్యోగులకు నోట మాట రాలేదు. హరిత ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక వడ్డీలకు అడ్డుకట్ట వేయాలి

అధిక వడ్డీ వేధింపుల కారణంగానే బ్యాంకు ఉద్యోగి రవికుమార్ ఆత్మహత్య చేసుకున్నారని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. రవి మృతదేహాన్ని హరితోపాటు మరికొందరు మార్చురీ వద్ద సందర్శించి, అతడి కుటుంబీకులను ఓదార్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ... నగరంలో వడ్డీ వ్యాపారుల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే... ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కాల్‌మనీ కేటుగాళ్లను ప్రభుత్వం, పోలీసులు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

వేధింపులను అడ్డుకోండి

పేదలను దోచుకుంటున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి ప్రజలను కాపాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల అవగాహన, మైక్రో ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడాలంటూ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా కోశాధికారి చంద్రిక సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు రమాదేవితోపాటు ఎల్‌డీఎం నరేష్ రెడ్డి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ వాసుదేవరెడ్డి, బ్యాంకింగ్ అధికారి భ్రమరాంబ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల అవసరాలను ఆసరా చేసుకుని రుణాలిచ్చిన కొన్ని మైక్రో ఫైనాన్స్ కంపెనీలు అధిక వడ్డీలతో దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక ఒత్తిడికి గురై అనేక మంది ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభులు రుణాలు పొందాలంటే ఆర్పీలు, పై సిబ్బందికి కమీషన్లు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని, ఈ సంస్కృతిని నిర్మూలించాలని కోరారు. అనంతరం ఎల్‌డీఎం నరేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా రుణాలందిస్తున్నాయన్నారు. సబ్సిడీ రుణాలు, విద్య, ఉపాధి, ఆర్థిక అవసరాలకు తక్కువ వడ్డీలతోనే రుణాలు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులు ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా కమీషన్లు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారిని భ్రమరాంబ మాట్లాడుతూ... ప్రజలకు తక్కువ ప్రీమియంతో ఆరోగ్య, ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థల రుణ ఒత్తిళ్లతో చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఏ ష్యూరిటీ లేకుండా రుణాలు ఇచ్చి, నెల కంతు చెల్లించకపోతే గద్దల్లా ఇళ్ల మీదకు వాలిపోయి వడ్డీవ్యాపారులు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు దృష్టి సారించి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు శ్యామల, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషాద్, అశ్విని, నగర నాయకులు గీత, శైలజ, వహీదా, షర్మాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య అంశాలపై దృష్టి పెట్టండి

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి, అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వివిధ రీతుల్లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. పౌరసరఫరాలు, పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్, చుక్కల భూముల ప్రక్రియ తదితర అంశాలలో పురోగతి సాధించాలన్నారు. తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు ఎఫ్‌పీ షాపులు తనిఖీ చేసి, నిత్యావసర సరుకులు సరిగా అందేలా చూడాలన్నారు. గుంతకల్లు, ఉరవకొండ, బొమ్మనహాళ్, పామిడి, యల్లనూరు, యాడికి మండలాల్లో రీ ఓపెన్ కేసులున్నాయని, వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

1,571 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,571 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువులను ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ బుధవారం పరిశీలించారు. యూరియా 754 మెట్రిక్ టన్నులు, డీఏపీ 407 మెట్రిక్ టన్నులు, 20-20-0-23 రకం ఎరువులు 410 మెట్రిక్ టన్నులు జిల్లాకు సరఫరా అయ్యాయయన్నారు. జేసీ ఆదేశాల మేరకు 402 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేటు డీలర్లకు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు 352 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన ఎరువులను పలువురు ప్రైవేటు డీలర్లతోపాటు మార్క్‌ఫెడ్‌కు కేటాయించామని వెల్లడించారు.

రేపు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి నేపథ్యంలో ఈనెల 8వతేదీన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఉంటాయన్నారు. గెలుపొందిన వారు జోనల్ స్థాయికి ఎంపికవుతారనారు. వివరాలకు 9966103956, 08554-353223 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బ్రహ్మసముద్రం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):మండలంలోని భైరవాన్‌తిప్ప గ్రామంలో ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అడ్డుకున్నారు. వివాహం చేస్తున్నారన్న సమాచారంతో ఐసీడీఎస్ సూపర్ వైజర్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలిక ఇంటికి వెళ్లారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తరువాతనే వివాహం చేయాలని, అతిక్రమించి వివాహం చేస్తే చట్టరీత్యా నేరస్తులవుతారని బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారితో 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేస్తామనే అంగీకారపత్రాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజినమ్మ, వీఆర్వో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి: డీఆర్ఓ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని నీటి వనరుల ఆక్రమణలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని డీఆర్ఓ మలోల ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా స్థాయి నిఘా కమిటీ (వాచ్ డాగ్ కమిటీ) సమావేశంలో పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఆక్రమణదా రులకు నోటీసులు జారీ చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, నీటి వనరులు, ట్యాంక్ బెడ్స్‌లోని ఆక్రమణల విషయంగా అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు సమన్వయంతో బృందంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ స్థితిగతులను పరిశీలించాలన్నారు. నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 386 ప్రకారం ఇంతకుముందు ఎన్నిచెరువులు, నీటి వనరులు ఆక్రమించారు, వాటిలో ఎన్ని ఆక్రమణలను తొలగించారు తదితర అంశాలకు సంబంధించి సమీక్షించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రిడ్జిపై రాకపోకలు: ఎమ్మెల్యే



అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లి క్రాస్‌లోని పండమేరు పాత బ్రిడ్జిపై గురువారం నుంచి రాకపోకలు పునఃప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. గత ఏడాది అక్టోబరులో భారీ వరదకు బ్రిడ్జి బేరింగులు దెబ్బతిన్నాయని, దీంతో రాకపోకలు నిలుపుదల చేశామని అన్నారు. కేంద్ర రవాణా, రహదారుల శాఖ నిధులు రూ.85 లక్షలు వెచ్చించి, మూడు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేయించామన్నారు.

ఏడు నెలల గర్భిణి ఆత్మహత్య

భర్త మోసం చేశాడని అఘాయిత్యం


మహమ్మద్ వలి, షేక్ షమీమ్ బాను పెళ్లి ఫొటో

గుంతకల్లు/టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌కు చెందిన ఏడు నెలల గర్భిణి షేక్ షమీమ్ బాను (34) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షమీమ్ బాను పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. తర్వాత ఒంట్లో బాధను భరించలేక స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో ఒక్కతే వెళ్లింది. వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వారు ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి షమీమ్ బానును అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నం చేశారు. అంబులెన్సు గుత్తి సమీపంలో వెళ్తుండగా షమీమ్ బాను మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమె గత నెల 14న గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వీఆర్వో మహమ్మద్ వలిపై ఫిర్యాదు చేశారు. మాయ మాటలు చెప్పి రెండో వివాహం చేసుకుని గర్భవతిని చేసి, వదిలించుకోవాలని చూస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేశారు. ఇది సాగుతుండగానే షమీమ్ బాను ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలి తండ్రి షేక్ పీర్‌బాషా బుధవారం రాత్రి 9గంటలకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కుమార్తె ఆత్మహత్య విషయంగా మహమ్మద్ వలిపై ఫిర్యాదు చేశాడు. తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకొని గర్భవతిని చేసి వదిలించుకోవాలని చూశాడని, దీంతో తన కుమార్తె మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెలగొండలో హత్య

గుంతకల్లు/టౌన్,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండ గ్రామంలో దాసరి గోవిందు (52)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవించే దాసరి గోవిందుపై బుధవారం రాత్రి 9గంటల సమయంలో సమీప బంధువైన దాసరి ఓబయ్య కొడవలితో దాడి చేశాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై వెళ్తున్న గోవిందును అటకాయించిన ఓబయ్య కొడవలితో నరికాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు రాత్రి నెలగొండ గ్రామానికి తరలి వెళ్లారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

నా కూతురు కనిపించడంలేదు..!

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తన కూతురు కనిపించడం లేదని పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కమతం శివయ్య టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. శివయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు నందిని డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి తను కనిపించడం లేదని శివయ్య ఫిర్యాదులో పేర్కొన్నారని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కేతిరెడ్డి కాలనీలో ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మత్తు మందు చల్లి గొలుసు చోరీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంకు వీధిలో ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్న కుసుమాంబ అనే మహిళపై దండగులు మత్తు మందు చల్లి, బంగారు గొలుసును తెంచుకువెళ్లారు. వస్తువులను కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు నటించి బుధవారం ఉదయం బురిడీ కొట్టించారు. ఆమెను మాటల్లోకి దింపి, ముఖంపై పౌడర్ చల్లారు. ఆమెకు మైకం కమ్మగానే మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం గొలుసును తెంచుకుని ఉడాయించారు. బాధితురాలు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విజయ్ కుమార్, ఇన్‌చార్జి సీఐ మారుతీ శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 9.., 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2026 ఫిబ్రవరి 7న అర్హత పరీక్ష ఉంటుందన్నారు. సెప్టెంబరు 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలలో 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అధ్యాపక పోస్టులకు..

బుక్కపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కాంట్రాక్టు పద్ధతిపై అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ బుధవారం తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్, గణితం సబ్జెక్టు బోధించడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ(55 శాతం మార్కులు)ఉండాలన్నారు. పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 11 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయా లన్నారు. 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం 9160044786, 9618853847కు సంప్రదించాలన్నారు.

రోడ్ల మరమ్మతులకు సవరణ ఉత్తర్వులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆర్అండ్‌బీ, రాష్ట్ర హైవే రోడ్లు, మేజర్ జిల్లా రోడ్ల మరమ్మతులకు సంబంధించి సవరణ ఉత్తర్వులను ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ బుధవారం విడుదల చేశారు. ఈమేరకు జీఓఆర్‌టీ నెంబర్ 411 జారీ చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు తయారు చేసి ఈఎన్‌సీకి పంపారు. వాటిని సవరిస్తూ, తదుపరి చర్యలకై ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పామిడి నుంచి వజ్రకరూరు రోడ్డు, కొనకొండ్ల నుంచి ఉరవకొండ రోడ్డు, ఉరవకొండ టౌన్ నుంచి లింక్‌రోడ్డు కనెక్టింగ్ కొనకొండ్ల నుంచి ఉరవకొండ రోడ్డు రూ.3.5 కోట్లతో అంచనాలు పంపారు. వీటిని నాబార్డు నిధులతో చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయి.

దీంతో వీటిని సవరిస్తూ ముస్టూరు నుంచి రామసాగరం, బోరంపల్లి రోడ్డు మరమ్మతులు చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో మధూడి, రాయా పురం రోడ్డు, బండ్రేపల్లి మీదుగా.. అదే విధంగా ఆర్‌జే రోడ్డు నుంచి జీఎస్ తండా రోడ్డు, హెచ్ఆర్ హట్టి మీదుగా.. అగళి నుంచి బొమ్మరసనపల్లి కొండేపల్లి రోడ్డు మీదుగా రూ.2.62 కోట్లతో మరమ్మతు లకు అధికారులు అంచనాలు పంపారు. మొదటి రెండు రోడ్లకు మాత్రమే సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

చేనేత దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటు వద్ద గల నేతన్న విగ్రహం సమీపంలో జాతీయ చేనేత దినోత్సవం జరపడానికి చేస్తున్న ఏర్పాట్లను ఆర్డీఓ మహేశ్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ చేతన్ హాజరవుతారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీఓతోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, తహసీల్దార్ సురేశ్‌బాబు పర్యవేక్షించారు. చేనేత రంగ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, నేతన్నల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులో ఉన్నాయని హరీశ్‌బాబు అన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేశ్, నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ (జయంతి)




'పచ్చదనం విప్లవ పితామహ'గా పేరొందిన పద్మవిభూషణ్ గ్రహీత, డాక్టర్ స్వామినాథన్ 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంబకోణంలో జన్మించారు. ఆయన పూర్తి పేరు మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్. జన్యుశాస్త్ర నిపుణుడు, పరిశోధకులు, రచయిత. ప్రత్యేకించి వరి, గోధుమ పంటలసాగుపై పరిశోధనలు చేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టారు. 50కుపైగా గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2007 నుంచి 2013మధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. యునెస్కో మహాత్మాగాంధీ గోల్డ్ మెడల్, ఇందిరా గాంధీ అవార్డ్ ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2023 సెప్టెంబరు 28న కన్నుమూశారు.

సుత్తివేలు (జయంతి)



వెండితెరపై 'సుత్తివేలు'గా పేరొందిన కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు 1947 ఆగస్టు 7న కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలంలో జన్మించారు. నాటక రంగం నుంచి వెండితెరపైన కమెడియన్‌గా, క్యారెక్టర్ నటుడిగా పేరొందారు. తెలుగులో రెండు దశాబ్దాలపాటు 200 కుపైగా సినిమాలలో నటించారు. 4 నంది అవార్డులు అందుకున్నారు. జంధ్యాల దర్శకత్వం లోనూ, నటుడు సుత్తి వీరభద్రరావుతోనూ కలసి ఎక్కువ సినిమాలలో నటించారు. బుల్లితెరపై పలు సీరియల్స్‌లో నటించారు. 2012 సెప్టెంబరు 16న కన్నుమూశారు.

డాక్టర్ ఎం కరుణానిధి (వర్ధంతి)



తమిళనాడులో సుమారు రెండు దశాబ్దాలపాటు ముఖ్యమంత్రిగా కొనసాగి తనదైన చరిత్రను లిఖించిన ముత్తువేల్ కరుణానిధి 1924 జూన్ 3న మద్రాస్ ప్రాంతం తిరుకువలైలో జన్మించారు. వెండితెరపై నటుడిగా సత్తా చాటి కలైజ్ఞర్‌గా పేరొందారు. సాహితీవేత్తగా ఎన్నో రచనలు చేశారు. నటుడిగా, రచయితగా, రాజకీయనేతగా, డీఎంకే నేతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ద్రవిడ ఉద్యమంలో కీలకంగా సాగి ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) పార్టీకి పదిసార్లు అధ్యక్షుడిగా కొనసాగారు. 60ఏళ్ల రాజకీయ జీవితంలో పోటీచేసిన ప్రతిసారి గెలుపొంది గిన్నిస్ రికార్డు సృష్టించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2018 ఆగస్టు 7న కన్నుమూశారు.

ఒలివర్ హార్డీ (వర్ధంతి)



అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు ఒలివర్ నార్వెల్ హార్డీ 1892 జనవరి 18న జన్మించారు. 1927 నుంచి 1955వరకు మూకీ నుంచి టాకీ సినిమాలలో నటించిన ఘనత ఉంది. 1914లో 'అవుట్ విట్టింగ్ డాడ్' ఆయన తొలిసినిమా. 'లారెల్ అండ్ హార్డీ' ద్వయంలో ఒకరు. 107 షార్ట్ ఫిల్మ్, ఫీచర్ ఫిల్మ్‌లో నటించారు. కమెడియన్‌గా పేరొందారు. 1957 ఆగస్టు 7న కన్నుమూశారు. కాగా లారెల్ అండ్ హార్డీ మ్యూజియం హార్డీ సొంత ప్రాంతం జార్జియాలోని హార్లెమ్‌లో ఏర్పాటైంది.

వ్యక్తిని ఢీ కొని... బైక్ చోదకుడు మృతి

బంగారపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై నిల్చున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బైక్ ఢీ కొన్న ఘటనలో బైక్ చోదకుడు మృతి చెందిన సంఘటన తాలూకాలోని బూదికోట గ్రామంలో చోటు చేసుకుంది. తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి ప్రాంతానికి చెందిన విక్రం (32) స్థానిక పట్టణంలోని ఒక దుకాణంలో పనిచేస్తున్నాడు. స్నేహితుడితో కలసి బైక్‌పై మార్కండేయ డ్యాంను చూసేందుకు బయల్దేరాడు. బూదికోట పెట్రోల్‌బంకు సమీపాన ఫుట్‌పాత్‌పై నిల్చున్న రామసంద్ర గ్రామానికి చెందిన ముని యప్పను ఢీ కొన్నాడు. ఈ సందర్భంగా కిందపడిన విక్రంకు తీవ్ర గాయాలు కాగా చికిత్సకోసం బంగారపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా బైక్‌పై వెనుక కూర్చున్న స్నేహితుడికి, ఫుట్‌పాత్‌పై నిల్చున్న మునియప్పకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బూదికోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నగదు ఇప్పించండి

● మూగదాలకొండ రైతులు

పావగడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కీరదోసకాయ, పత్తి పంటలను కొన్ని కంపెనీల మాటలు విని ఒప్పందాల మేరకు సాగుచేశామని, దిగుబడి తీసుకెళ్లి డబ్బు చెల్లించకుండా కంపెనీల చుట్టూ దళారులు తిప్పుతున్నారని మూగదాలకొండ గ్రామరైతులు అన్నారు. తమకు డబ్బు ఇవ్వాలని, ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని వారు పేర్కొన్నారు. మూడు ఎకరాల పొలంలో కీరదోసకాయ పంటను అప్పు చేసి సాగుచేశామని, హైదరాబాద్‌కు చెందిన కంపెనీకి సరుకును ఇచ్చామన్నారు. సరుకు తీసుకుని ఇంత వరకు నగదు చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతులకు కూడా నగదు చెల్లించలేదని, ప్రభుత్వం చర్యలు తీసుకుని నగదును ఇప్పించాలని కోరారు.

వ్యాపారులకు పండగే..!



గాంధీబజార్‌లో వివిధ రకాల పూల మాలలు



కేఆర్ మార్కెట్ కూడలిలో జనరద్దీ ఇలా...

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా మార్కెట్‌లు అప్పుడే కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా పూలుపండ్లు, పత్రులతోపాటు అలంకరణ సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పెరిగిన గిరాకీలతో వ్యాపారులకు పండగలా మారింది. దీంతో బుధవారం రాత్రికే బెంగళూరు, మైసూరు ప్రాంతాలకు వివిధ ప్రదేశాలనుంచి పూలు భారీ ఎత్తున తరలివచ్చాయి. తెల్లవారుజామున 4 గంటలనుంచే మార్కెట్‌లో విక్రయాలు ప్రారంభమయ్యాయి. బుధవారం పలు మార్కెట్‌లలో కొనుగోళ్లతో సందడి అనిపించింది. కేఆర్ మార్కెట్, మల్లేశ్వరం, గాంధీబజార్, కేఆర్‌పురం, మడివాళ, యలహంక తదితర మార్కెట్‌లు రద్దీగా కనిపించాయి. ఎటుచూసినా కొనుగోళ్లతో సందడి నెలకొంది.

సాగులో సూక్ష్మపోషకాల వాడకంపై జాగృతి



జాగృతి శిబిరంలో డాక్టర్ సంధ్య తదితరులు

చింతామణి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సాగులో సూక్ష్మపోషకాల వాడకంపై పట్టణంలోని కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా ఏర్పాటైన కార్యక్రమంలో కమ్మగుట్టహళ్ళి, చిక్కబళ్ళాపుర తాలూకా, చిక్కతమ్మలహళ్ళి, గుడిబండ తాలూకాల రైతులు పాల్గొన్నారు. సైంటిస్ట్ డాక్టర్ సంధ్యా కే సాగుపై పలు అంశాలను వివరించారు. బోరాన్, క్లోరిన్, తామ్ర, ఐరన్, మ్యాంగనీస్, మాలిబ్డినం, నికెల్ వంటి సూక్ష్మ పోషకాంశాలు పూలు, పండ్ల పెంపకంలో క్రియాశీలకంగా ఉంటాయన్నారు. పోషకాంశాల కొరత కారణంగా మొక్కలలో, రోగలక్షణాలకు కారణమవుతాయన్నారు. ఆకులు రంగు మారడం, పంటల దిగుబడి తక్కువగా ఉంటాయన్నారు. జిల్లాలో మట్టి సారంపై సర్వేలో బోరాన్ తక్కువగా ఉందని తేలిందన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఎలాంటి పంటలకు ఏఏ ఎరువులు, పోషకాలు వాడాలనేది అవగాహన సాధ్యమన్నారు. సూక్ష్మపోషకాలు తగినంతగా ఉంటే పంటల దిగుబడి పెరగడంతోపాటు భూసారం పెరిగి ప్రాణులకు, మనుష్యుల ఆరోగ్యం సాధ్యమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉద్యానవనాలశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సౌమ్య హీరేగౌడర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా సరికొత్త రికార్డుపై హర్షం



సీకల్ రామచంద్రగౌడ

శిడ్లఘట్ట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అత్యధిక కాలం కొనసాగిన హోంమంత్రిగా సరికొత్త రికార్డు సృష్టించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ కొనియాడారు. పట్టణంలోని బీజేపీ సౌధలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ 2019 మే 30 నుంచి కేంద్ర హోం మంత్రిగా అమిత్‌షా కొనసాగుతు న్నారన్నారు. ఇంతవరకు గోవింద వల్లభపంత్, లాల్‌కృష్ణ అద్వాణిలు నెల కొల్పిన రికార్డును అమిత్‌షా అధిగమించారన్నారు. అద్వాణి 6 సంవత్సరాల 64 రోజులు, గోవింద వల్లభపంత్ 6 సంవత్సరాల 56 రోజులు కొన సాగారన్నారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ వంటి వాటిని రూపొందించడంలో అమిత్‌షా ఎంతో శ్రమించారన్నారు. జమ్ము కశ్మీర్‌లకు సంబంధించి ప్రత్యేకించి ఆర్టికల్ 370ని రద్దు చేయడంలో అమిత్‌షా నిర్ణాయకపాత్ర వహించారన్నారు. ఉగ్రవాదుల నియంత్రణతోపాటు పలు అభివృద్ధి పథకాల రూపకల్పనలో కీలకంగా ఉన్నారన్నారన్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ, వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయంలో అమిత్‌షా కీలకపాత్ర పోషించా రన్నారు. దేశ అంతర్గత భద్రతను బలోపేతం చేశారన్నారు. మీడియా సమా వేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తాలూకాస్థాయికి విద్యార్థుల ఎంపిక



ప్రశంసాపత్రాలతో విద్యార్థుల బృందం

బంగారపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హోబళి స్థాయి క్రీడాపోటీల్లో కిత్తూరు రాణి చెన్నమ్మ వసతి పాఠశాల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. వివిధ పోటీల విజేతలు తాలూకాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీ లోకేశ్ తెలిపారు. ప్రాథమిక పాఠశాల విభాగంలో 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ఎస్ కృతిక ప్రథమస్థానంలో నిలిచారన్నారు. 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో సీ కీర్తి ద్వితీయస్థానంలో నిలవగా, షాట్‌పుట్‌లో ప్రాథమస్థానం, ఫ్లైయింగ్ సాసర్ విసరడంలో మేఘశ్రీ తృతీయ స్థానంలో నిలిచారు. 100 మీటర్లలో పరుగుస్థానం, 600 మీటర్లలో ద్వితీయ స్థానం, 4/100 రిలే పరుగులో ప్రథమస్థానంలో గానవి నిలిచారు. ఇక హైస్కూల్ విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో, హైజంబప్‌లో లలిత ప్రథమస్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగులో, 300 మీటర్ల పరుగులోనూ లావణ్యశ్రీ ప్రథమస్థానంలో, జావెలిన్ త్రోలో జీ శిల్ప, నడకలోనూ, హర్డిల్స్‌లోనూ లావణ్య ప్రథమస్థానం సాధించారు. ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలలో పలువురు విద్యార్థులు ప్రతిభను చాటారు. గెలుపొందిన విద్యార్థులంతా తాలూకాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపి అభినందించారు.

పట్టణంలో వైద్యశిబిరం



బెంగళూరుకు బయల్దేరుతున్న రోగుల బృందం

శిడ్లఘట్ట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్ఎన్ క్రియా ట్రస్టు సంస్థాపక అధ్యక్షులు, కాంగ్రెస్ నేత ఆంజనేయ (పుట్టు) నేతృత్వంలో సుమారు 14ఏళ్లుగా భారీ స్థాయి ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శిబిరాలలో పాల్గొనే రోగులకు అయ్యే వైద్య ఖర్చులను ట్రస్టు భరిస్తోందని యువ నాయకుడు ఆనూరు ఆనంద్ తెలిపారు. పట్టణంలోని ట్రస్టు కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో బెంగళూరు సప్తగిరి ఆసుపత్రి సహకారంతో సుమారు 50మందికిపైగా రోగులను వివిధరకాల శస్త్రచికిత్సలకోసం ప్రత్యేక వాహనంలో తరలించారు. ప్రముఖులు మహ్మద్ సాదిక్, ఆనె మడుగు హరీశ్, అప్సర పాషా, ఆంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాలకు శ్రీకారం



భూమిపూజలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

బాగేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నల్లపరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జిలాజిర్ల గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాగేపల్లి పట్టణం నుంచి జిలాజిర్ల గ్రామం వరకు రోడ్డు ఉందని, గ్రామంనుంచి రాష్ట్ర సరిహద్దుదాకా రోడ్డు బాగు చేసేందుకు రూ.50లక్షలు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. రోడ్డు పనులలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని దశలవారీగా చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆనంద్, మోటకపల్లి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రముఖుడు శ్రీనివాసరెడ్డి, నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు



● కలెక్టర్ నితీశ్

రాయచూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువపత్రాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపిస్తున్నట్లు జిల్లాధికారి కే నితీశ్ తెలిపారు. ఇందులో ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా ఆరోపణలు రుజు అయితే బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడిన ఆయన ఇందులో మహానగర పాలిక అధికారుల పాత్ర ఉన్నా సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారుల పాత్ర ఉన్నా అందుకు బాధ్యులైన వారి పై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నగరంలోని విలువైన స్థళాలను కొంతమంది స్థానికంగా లేని యజమానులను గుర్తించి వారి పేరున తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు సాగినట్లు వచ్చిన ఆరోపణల పై బాధితులు ఇచ్చిన ఫిర్యాదులకంటే ఎక్కువ సంఖ్యలోనే కేసులు నమోదు చేసినట్లు జిల్లాధికారి ఈ సందర్భంగా తెలిపారు. విచారణ వేగవంతంగా సాగుతున్న నేపథ్యంలో త్వరలోనే నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా జిల్లాలో సహకార సంఘాలకు మంజూరు చేసిన యూరియా పక్కదారి పట్టిన కఠిన చర్యలు ఉంటాయన్నారు. కల్లూరు సహకారం సంఘం అధ్యక్షుడి పై ఇప్పటికే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణకు ఆదేశించామన్నారు. ప్రభుత్వం యూరియాను సహకార సంఘాలతో పాటు ప్రైవేటు డీలర్‌లకు సహితం అందజేసిందన్నారు. ఈ విషయంలో ఎవ్వరు నిబంధనలు పాటించకపోయినా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

భారీ వర్షం.. రైతుల హర్షం

మడకశిర, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన రెండు నెలల తరువాత వర్షం పడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. నియోజకర్గంలో 28 వేల హెక్టార్లకు గాను 15 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయి. అందులో వేరుశనగ 12 వేల హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో సాగు చేసిన పంటలకు వర్షం లేక ఎండుముఖం పడుతున్న సమయంలో వర్షం పడడంతో పంటలకు ఊపిరి పోసినట్లు అయిందని రైతులు అంటున్నారు. వేరుశనగ సాగు చేసేందుకు భూమిలో తేమ బాగుండడంతో రైతన్నలు వేరుశనగ సాగుకి సన్నద్ధంమయ్యారు. గత ఏడాది వర్షం కురవకపోవడంతో వేరుశనగ సాగు కూడా విడతల వారీగా చేయాల్సి వచ్చింది. అయితే కొంత మంది రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకుమొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో భారీగా వర్షం కురిసింది. పొలాల్లో సైతం నీరు నిల్వ ఉండే విధంగా వర్షం పడింది. వేరుశనగ పంటను ఈనెల 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చని, కంది, ఆముదం పంటలను నెలాఖరు వరకు సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పొలాల్ని బీడుగా వదిలేవాళ్లం

గత యేడు వేరుశనగ పంట దెబ్బతిని నష్టపోయామని, ఈ ఏడైనా ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసి అప్పుల ఊబినుంచి బయటపడదామని గంపెడు ఆశతో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అప్పులు చేసి వేరుశనగ సాగుకు సిద్ధం అయితే రెండు నెలలైనా వర్షం కురవలేదని, రెండు రోజులుగా వర్షం బాగా పడటంతో తిరిగి సాగుకు సిద్ధమవుతున్నామంటున్నారు. వర్షం పడకపోయివుంటే పొలాలను బీళ్లుగా వదిలేసేవాళ్లమని, వరుణదేవుడు కరుణించడంతో వేరుశనగ సాగు చేస్తున్నామని పేర్కొంటున్నారు.



వర్షం రావడంతో జీవం పోసుకుంటున్న వేరుశనగ పంట

బాగల్కోటె విద్యార్థినికి
క్రికెటర్ రిషబ్‌పంత్ సాయం



విద్యార్థిని జ్యోతి

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లా బీళగి తాలూకా చవడాపుర రబకవి గ్రామానికి చెందిన జ్యోతి కణబూరు అనే విద్యార్థినికి ఉన్నత చదువుకోసం క్రికెటర్ రిషబ్‌పంత్ ఆర్థికసాయం చేశారు. పీయూసీలో 83శాతం మార్కులు సాధించిన జ్యోతి ఉన్నత చదువుకు వెళ్లేందుకు ఆర్థిక సమస్య కారణమైంది. జ్యోతి తండ్రి తీర్థయ్య టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. సొంతూరుకు చెందిన కాంట్రాక్టర్ అనిల్ హుణసికట్టి విజయపురలో స్థిరపడ్డారు. ఇటీవల గ్రామానికి వచ్చిన అనిల్‌కు విద్యార్థిని తండ్రి కష్టం చెప్పాడు. దీంతో అనిల్ బెంగళూరులోని స్నేహితుడు అక్షయనాయక్‌కు సమాచారం ఇచ్చాడు. అక్షయ్ మిత్రుడైన క్రికెటర్ రిషబ్‌పంత్‌కు వివరాలు పంపారు. వెంటనే స్పందించిన రిషబ్‌పంత్ కళాశాలలో చేరాలని సూచిస్తూనే 40వేల రూపాయలు ఫీజును బీఎల్‌డీఈ కళాశాలకు పంపారు. ఇలా బీసీఏ కోర్సులో చేరింది. బీఎల్‌డీఈ సంస్థ ముఖ్యులు ప్రొఫెసర్ శ్రీకాంత్ లగళి మీడియాకు సమాచారం ఇచ్చారు.

వైభవంగా కల్యాణోత్సవం



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

ముళబాగిలు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరలేశ్వర పాళ్యలో పురాణ ప్రసిద్ధమైన గోవింద రాజస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణోత్సవం, తిరుప్పా వడ సేవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలం కరణ చేశారు. వినాయకుడు, ఆంజనేయస్వామి, గరుడ, జయ విజయలు, వరాహస్వామి, నరసింహస్వామి, హయగ్రీవుడు, గోదాదేవి తదితర పరివార దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సత్యనారాయణ, సంచాలకులు ప్రదీప్ నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగాయి. అర్చకుడు పవన్‌కుమార్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు జరిగాయి.

10న బిల్లవ అసోసియేషన్ స్వర్ణమహోత్సవం

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో బిల్లవ అసోసియేషన్ పేరిట ఐదు దశాబ్దాలుగా సమాజసేవ కొనసాగిస్తున్న సంస్థ ఈనెల 10న సువర్ణ మహోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వేదకుమార్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిల్లవ సంఘంలో 6వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. దక్షిణకన్నడతోపాటు కాసరగూడు, కొడగు, చిక్కమగళూరు, బెంగళూరు, మైసూరు ప్రాంతాలలో తమ సామాజికవర్గం అధికంగా ఉందన్నారు. ఏటా విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరం వంటి సేవలు కొనసాగిస్తున్నామన్నారు. 10న ఆదివారం ఉదయం 8 గంటలనుంచి రాత్రి వరకు కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. జానపద సందడి, యక్షహాస్యరస, కిలాడి దర్బార్, కలివిలి కామెడీ, సువర్ణ నర్తన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. నగరంలోని ప్యాలెస్ గ్రౌండ్స్ వైట్‌పెటల్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్సవాలను ప్రారంభిస్తారని, విఖ్యాతానంద స్వామిజీ ప్రత్యేక ఆహ్వానితులుగా వస్తారన్నారు. డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు పాల్గొనన్నట్టు తెలిపారు.

ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): యువతకు వృత్తిపరమైన నైపుణ్యత కల్పించేందుకోసం సంగీతనిధి కార్యక్రమాన్ని ఉన్నత ఫౌండేషన్ ద్వారా ఉన్నతి ఉత్సవ్, గోకులాష్టమి పేరిట సంబరాలు జరపనున్నారు. ఈనెల 24వరకు హలసూరు వడకత్తూరు మఠంలో ప్రత్యేక కార్యక్రమంలో కొనసాగనున్నట్టు ప్రకటించారు. ఉన్నతి ఫౌండేషన్ లాభాపేక్షలేని సంస్థ అని, దేశవ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన యువతకు వృత్తిపరమైన శిక్షణలు ఇస్తున్నట్టు ప్రకటనలో తెలిపారు. ఉత్సవంలో టీఎం కృష్ణ, శివశ్రీ స్కంద ప్రసాద్, సుధారఘునాథన్, అభిషేక్ రఘురాం, విశాఖహరితోపాటు ప్రముఖ కళాకారులు సంగీత కచేరీలు ఉంటాయని ప్రకటించారు.

గవిసిద్ధప్ప హత్యకేసులో నలుగురి అరెస్టు

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవాలనుకున్న యువతి మరొకరితో ప్రేమలో ఉండడాన్ని జీర్ణించుకోలేక కొప్పళ నగరం గవిసిద్ధప్పను హత్య చేసిన కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. సైలాన్‌పుర కాలనీ నివాసి సాదిక్ హుసేన్ కోల్కార్ ముస్లిం సామాజిక వర్గానికి చెందిన యువతిని ఇష్టపడి పెళ్లి చేసుకోదలిచాడు. అదే యువతిని గవిసిద్ధప్ప కూడా ప్రేమిస్తుండడంతో ఇద్దరిమధ్యా పలుమార్లు గొడవ జరిగినట్టు కొప్పళ ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ధి బుధవారం మీడియాకు తెలిపారు. ఆదివారం రాత్రి గవిసిద్ధప్పను సాదిక్ హతమార్చి నేరుగా టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారన్నారు. మిగిలిన నిందితులు గే సుదరాజపటేల్, మహ్మద్ నిజాముద్దీన్, మహ్మద్ సిక్కల్‌గార్‌లను అరెస్టు చేశామన్నారు. వారు ఉపయోగించిన వేటకొడవళ్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. వ్యక్తిగత కారణాలు మినహా మతాలకు సంబంధించిన వివాదం లేదన్నారు.

ఇంటి ఆహారం తరహాలో కొత్త రుచులు

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇంటి ఆహారం తరహాలో కొత్త రుచులను పరిచయం చేసేందుకు 'బావు టు మి' అనే సరికొత్త రెస్టారెంట్ నగరంలో ప్రారంభించారు. ఏషియన్‌లో స్ట్రీట్ ఫుడ్ తరహాలో కొత్త రుచులను అందించదలిచారు. బెంగళూరులో ఉంటున్న ముగ్గురు స్నేహితులు వాన్‌మింగ్ లి, పోమింగ్‌లి, విశ్వతేజ్‌లు కలసి ఏర్పాటు చేశారు. 2021లో క్లౌడ్ కిచెన్‌ను ప్రారంభించినవారు తాజాగా కోరంగలలో ఏర్పాటు చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.14
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,788	84,696
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	23,430	55,696
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	102.34



కరిమారెమ్మ ఆలయం

12న కరిమారెమ్మ ఆలయ వార్షికోత్సవం

బళ్లారి సిటీ,ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని కరిమారెమ్మ ఆలయం వార్షిక జాతర ఈనెల 12 మంగళవారం జరుగుతుందని హిందూ మత దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి హనుమంతప్ప తెలిపారు. ఏటా ఉత్సవాల తరహాలోనే ఉదయం కరిమారెమ్మన ఉత్సవం కౌల్‌బజార్ ప్రధాన రహదారి నుంచి ప్రారంభమై మధ్యాహ్నం ఆలయానికి చేరుకుంటుందన్నారు. ఆ సాయంత్రం 4గంటల తర్వాత మహాకుంభ జల ఉత్సవ్ నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో బొమ్మల నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు , ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది

కంప్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి వార్డులో ప్రజలు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ అధికారులు స్థానికులకు సూచించారు. బుధవారం 16, 17 వార్డుల్లో కుడితిని పంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు సమాజ సేవకుడు సత్యప్ప కౌన్సిలర్ లెనిన్ మాట్లాడుతూ ప్రజలు బహిరంగ విసర్జనకు దూరంగా ఉండి, ప్రభుత్వం ఇచ్చిన శౌచాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్లాస్టిక్ ముక్త పట్టణం కావాలన్నారు. హోస్పేట రోడ్డులోని ఆరు బయట పరిశుభ్రం చేపట్టి ముగ్గులు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తాచెదారాలను వాటి కుండీలు వేసి పట్టణ పంచాయతీ ద్వారా వచ్చిన వాహనంలో చెత్తను వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, దేవేంద్ర, హనుమంతు, నళిని, యాస్మిన్, వార్డు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఏపీఎంసీ మార్కెట్‌లో ఆగిపోయిన కొనుగోళ్లు

● వేరుశనగ కొనుగోలులో మోసాలు జరిగాయంటున్న రైతులు ● ఆరోపణలపై మండిపడుతున్న వ్యాపారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీఎంసీ మార్కెట్‌లో బంద్ కొనసాగుతోంది. రైతులు చేపట్టిన ఆందోళన ఆరోరోజుకు చేరుకుంది. దీని కారణంగా వర్షాకాలం పంటను అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేరుశనగ పంట అధికంగా ఆంధ్రప్రదేశ్ నుంచి మార్కెట్‌కు వస్తుంది. మార్కెట్‌లో దీని వ్యాపారం ముఖ్యమైనది, కానీ వారం క్రితం కొనుగోలుదారులు ఆంధ్రప్రదేశ్ నుండి రైతులు తీసుకువచ్చిన వేరుశనగకు చాలా తక్కవ ధరకు టెండర్ పిలిచారు. 7 వేల రుపాయలు ఉన్న ధరను 4,500కు తగ్గించారు. దీంతో విసిగిపోయిన రైతులు బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లోని అధికారులను , కొనుగోలుదారులపై మోసానికి పాల్పడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. వేరుశనగలను బళ్లారి మార్కెట్‌కు తీసుకురావద్దంటూ సోషల్ మీడియాలో వీడియో తీసి ప్రచారం చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన కొనుగోలుదారులు ఏకమై వేరశనగలు పచ్చిగా ఉన్నాయని వాటిని కొంటే కుళ్ళిపోతాయని కొనకూడదని నిర్ణయించారు. టెండర్లు వేయడం మానేశారు. ఏపీఎంసీ మార్కెట్ కార్యదర్శి అధ్యక్షుడు కొనుగోలుదారుల సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనిపై చర్చించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఫలితంగా మార్కెట్‌లో సరకులు, రైతులు, ప్రజలు లేకుండా ఖాళీగా మారింది.



బోసిపోయిన ఏపీఎంసీ మార్కెట్

భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాలి

● సాహిత్య సదస్సులో విమర్శకుడు ఎస్.సిరాజ్ అహ్మద్



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిరాజ్ అహ్మద్

బళ్లారి సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల విపరీతమైన స్వేచ్ఛ అనర్థాలకు దారి తీస్తోందని, భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవడానికి నిరంతరం పోరాడాలని విమర్శకుడు ఎస్.సిరాజ్ అహ్మద్ అన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ , కన్నడ విశ్వవిద్యాలయంలోని కన్నడ సాహిత్య అధ్యయన విభాగం సహకారంతో హంపి కన్నడ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన దక్షిణ భారత భాషల్లో సాహిత్య విమర్శపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. గతంలో చాలా మంది ఆలోచనాపరులు, రచయితలు, జర్నలిస్టులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు దాడులు జరిగాయన్నారు. ఇది వ్యక్తులపై మానసిక ఒత్తిడిని కలిగిస్తోందని, ఈ ప్రమాదాలు ఉన్నప్పటికీ దీనికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది ప్రజాస్వామ్య పునాదిలో భాగం,సమాజం యొక్క ఆరోగ్యకరమైన అభివృద్ధికి అవసరమన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీ పరమశివమూర్తి మాట్లాడుతూ సాహిత్య ప్రక్రియలు ఏదిశలో పయనించాలో నిర్ణయించడానికి విమర్శకు వీలు కల్పిస్తుందన్నారు. సాహిత్య అకాడమీ ,దక్షిణ ప్రాంతీయ మండలి కన్వీనర్ మృణాళిని మాట్లాడుతూ దక్షిణ భారత సాహిత్యాన్ని ఇతర భాషలలోకి అనువదించినప్పుడు దాని విలువ పెరుగుతుందని, సాహిత్యం స్వేచ్ఛగా మారినప్పుడు భాషా అడ్డంకులు తగ్గుతాయన్నారు. ఈసందర్భంగా అకాడమీ సలహామండలి కన్వీనర్ ప్రొఫెసర్ బసవరాజ్ కల్గుడి, ప్రొ.వెంకటగిరి దళవాయి, మను బలిగర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార దుకాణాల కూల్చివేత



ఏపీఎంసీలో అక్రమ కట్టడాలను కూలుస్తున్న అధికారులు

బళ్ళారి గాంధీనగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ (ఏపీఎంసీ) ప్రాంగణంలో వెలసిన అక్రమ దుకాణాలపై ఏపిఎంసి సెక్రటరీ జయకుమార్ కొరడా ఝులిపించారు. సమితి అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలని ఇప్పటికే వారం రోజుల క్రితమే నోటీసులు జారీ చేశారు. నోటీసులను బేఖాతరు చేయడంతో పాటు అక్రమంగా దుకాణాల దారులు నగరంలోని ప్రముఖల నుంచి మార్కెట్ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. స్వతంగా తొలగించడానికి అధికారులు ఇచ్చిన అవధి ముగియడంతో సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో ఎక్స్‌కవేటర్ల సహాయంతో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న మూడు దుకాణాలను నేల కూల్చారు. గత కొన్నేళ్ళు నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా అంగళ్ళు ఏర్పాటు చేసుకుని ఏపీఎంసికి కష్టాన్ని కలిగించినట్లు అధికారులు తెలిపారు. దుకాణాలు కూల్చివేతతో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిలో ఆందోళన మొదలయ్యింది. ఏపీఎంసి సమితి అనుమతి లేకుండా అంగళ్ళను ఏర్పాటు చేసుకుని మార్కెట్‌కు నష్టం కలిగిస్తే విస్మరించేది లేదని, నిర్దాక్షిణ్యంగా కట్టడాలను తొలగిస్తామని సెక్రటరీ జయకుమార్ హెచ్చరించారు.

రాయచూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు

రాయచూరు, ఆగస్టు 6 : రాయచూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం గురువారం తెల్లవారు జాము వరకు కురిసిన నేపథ్యంలో పలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాజీవనం అస్తవ్యస్థమైంది. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మాన్వి తాలూకాలోని అడవి ఖానాపూర్ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. రాయచూరు తాలూకా ఇడపునూరు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తు పంట పొలాల్లోకి నీరు చొచ్చుకు రావడంతో మధ్యాహ్నం వరకు ఈ మార్గంలో వాహన సంచారం రాకపోకలు నిలిచిపోయాయి. పత్తెపూర్ వాగు మరోసారి ఉధృత రూపం దాల్చడంతో ఈ వాగు పై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన గత నెలలో కురిసిన వర్షానికే కొట్టుకుపోగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు సహితం ప్రస్తుత వర్షానికి పూర్తిగా కొట్టుకు పోయింది. దీంతో పత్తెపూర్‌తో పాటు మరో ఐదు గ్రామాల ప్రజలకు రాకపోకలు తీవ్రంగా ఇబ్బంది తలెత్తింది. పలు చోట్ల పంటపొలాలు నీట మునిగినట్లు రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా కంది, పత్తి, చెళ్లల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచి ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా జిల్లాలో అత్యధికంగా లింగసుగూరు తాలూకాలో 25.4 మిలిమీటర్‌ల వర్షపాతం నమోదు కాగా రాయచూరులో 21.7, సిరవారలో 20.4 మిలిమీటర్‌లు, మాన్విలో 17.5 మిలిమీటర్‌లు, సింధనూరులో 16 మిలిమీటర్‌లు కురువగా దేవదుర్గ, మస్కి తాలూకాల్లో 9.3 మిలిమీటర్‌ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



లింగసుగూరులో పొంగి పొర్లుతున్న వాగు

బస్సుల కొరతతో ప్రయాణికులకు కష్టాలు

సిరుగుప్ప, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల కొరతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిరుగుప్ప తాలుకా నుంచి సింధనూరు, బళ్లారికి వెళ్లాలంటే తగినన్ని బస్సులు లేవని స్థానికులు వాపోతున్నారు. శక్తి గ్యారెంటీ పథకాల జారీ చేసినప్పటి నుంచి బస్సులను తగ్గించడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. గంటల తరబడి బస్టాండ్‌లో వేచిఉన్నా బస్సు దొరకడం లేదని, తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



బస్సు ఎక్కడానికి తోసుకుంటున్న ప్రయాణికులు

ఆకట్టుకుంటున్న జలపాతాలు

కంప్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : రెండు మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలపాతాలు కళకళలాడుతున్నాయి. హంపి పుణ్యక్షేత్రంలో ఏ కొండలో చూసినా నీరు జలపాతాలు పారుతున్నాయి. వెంకటాపురం వద్ద జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హంపిలో ఆలయాలు మండపాలు, స్మారకాల సందరశనకు వాటితో పాటు కొండల్లో నుండి పారుతున్న జలపాతాలు పూర్తిగా ఆకట్టుకుని ఆనందాన్ని కలిగిస్తున్నాయి.



వెంకటాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతం



బాలుడి కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భరత్ రెడ్డి

రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేత

చెత్త ఆటో ఢీకొని మృతి చెందిన బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే అండ

బళ్లారిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాపూజీనగర్‌లో వారం రోజుల క్రితం చెత్త తరలించే ఆటో కింద పడి మృతి చెందిన బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి బుధవారం రూ.5లక్షల పరిహారం అందజేశారు. ప్రమాదంలో మృతి చెందిన విక్కీ అనే బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి తల్లిదండ్రులకు ప్రభుత్వం తరఫున రూ. 25 లక్షలు అందజేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మహానగరపాలిక కార్పొరేషన్ ద్వారా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖలీల్‌సాబ్ మున్నాఫ్ పటేల్, కుమార్, శివరాజ్, సూరి, వన్నప్ప, హగరి గోవింద బాపూజీనగర్, వెంకటేష్, చానాల్ శేఖర్, సతీష్, ప్రేమ్, భరత్ బాలరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జంతు బలి హాలుమతస్థుల సంస్కృతి కాదు

● సిద్దరామానందపురి స్వామీజీ



శ్రావణ మాస పూజలను ప్రారంభిస్తున్న స్వామీజీ

బళ్లారి సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దేవతల పేరుతో గొర్రెలు, మేకలు బలి ఇవ్వడం హాలుమతస్థుల సంస్కృతి కాదని, ఇటువంటి మూర్ఖపు ఆచారాలను ఆచరించే కుటుంబాలను పేదరికం ముంచెత్తుతుందని కాగినలే పీఠంలోని తింథిని కి చెందిన సిద్దరామానందపురి స్వామీజీ పేర్కొన్నారు. బుధవారం విజయగరం జిల్లా మైలారలింగేశ్వర ఆలయంలో నిర్వహించిన శ్రావణ మాస యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హాలుమతర పర్యావరణ అవగాహన కోసం ఈయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాలుమతస్థులు ప్రాథమికంగా ప్రకృతి ఆరాధకులని, పిల్లలు, తండ్రి , తల్లిపేరుతో చెట్లను నాటడం రక్షించడం ద్వారా జీవులకు ఆహారం ఇచ్చినా పుణ్యం లభిస్తుందన్నారు. సమాజం శ్రీరాముడు, కృష్ణుడి కథల కంటే బీరప్ప, మైలారలింగ, రేవణ సిద్దేశ్వర కథలను తెలుసుకోవాలన్నారు. పరశురామప్ప మాట్లాడుతూ గొర్రెలు తలలు వంచుకుని నడుస్తాయి కానీ కాపరులను తలలు ఎత్తుకుని నడిపిస్తాయన్నారు. ఈసందర్భంగా శ్రీరామ ఆలయ ధర్మకర్త రాకేశయ్య , పరశురామప్ప, రాష్ట్ర గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్ బి.హనుమంతప్ప, సంఘం అధ్యక్షుడు బీరప్ప, నాయకులు ఈటీ లింగరాజు, డి.వి రూపన్న, ప్రకాశ్, మాలతీశ, రవీంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మించు శ్రీనివాస్ తదితరులు

బళ్లారి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని 35వ వార్డు సమీపంలో ఉన్న కరిమారెమ్మ దేవి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ధార్మికదత్తి ఇలాఖే అధికారికి కార్పొరేటర్ మించు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 35 వార్డు ప్రజలు మనవిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మించు శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి ఆంధ్ర, బళ్లారి జిల్లాల నుంచి అధికంగా వస్తారని, ఉత్సవాల సమయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టామన్నారు. అదేవిధంగా నగరంలో కోట మల్లేశ్వర దుర్గమ్మదేవి జాతర మాదిరిగానే కరి మారెమ్మ దేవస్థానం జాతరను నిర్వహి స్తామన్నారు.

ఉచ్చీరప్ప తాత ఆలయంలో అఖండ భజన

సిరుగుప్ప, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : శ్రావణ బుధవారం పురస్కరించుకుని ఉచ్చీరప్ప తాత మఠంలో అఖండ భజనలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాత మఠంలో భక్తులు తాతకు పుష్పాలంకార సేవలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప ఆచార్యులు ధూపదీప నైవేద్యములతో స్వాములకు పూజలు జరిపారు. బసవబళగ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



భజనలో పాల్గొన్న భక్తులు

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.4 లక్షల బంగారం ఆభరణాల స్వాధీనం



ఆభరణాలను చూపుతున్న బ్రూస్‌పేట పోలీసులు

బళ్లారి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకుని రూ.4 లక్షల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బ్రూస్‌పేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాంతేష్ నేతృత్వంలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు చోరీల్లో నిందితుడిగా తేలిందన్నారు. విజయనగరం జిల్లా కుప్పనగిరి గ్రామానికి చెందిన పోతరాజు, సద్దాం, గౌతమ్‌రాజ్, అనే ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. రాయచూరు జిల్లా నేతాజీ పోలీస్ స్టేషన్లో పలు దొంగతనాలకు పాల్పడుతూ కేసు నమోదు చేసినట్లు వారు అంగీకరించారు. ఈ కేసులకు సంబంధించి వేరే వద్ద నుంచి దాదాపు రూ. 4.08 లక్షలు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఎస్పీ శోభారాణి అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ మల్లికార్జున హెడ్ కానిస్టేబుల్ ఉమేష్ రెడ్డి, శ్రీనివాస్, ప్రభావతి పోలీసులు శివరాజ్, దొడ్డ బసన్నగౌడ పాల్గొన్నారు.

హోసూరు జోన్



బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్

ఎలువపల్లికి బస్సు సర్వీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే

హోసూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గం పెరిగై సమీపాన ఎలువపల్లి గ్రామానికి బస్సు సేవలు అందుబాటులోకి తెచ్చారు. పెరిగై నుంచి ఎలువపల్లి మీదుగా తిమ్మచంద్ర ప్రాంతానికి 31వ నెంబరు సర్వీసు బస్సును ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాశ్ స్వయంగా బస్సు నడిపి ఆర్టీసీ సేవలకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లగా ఉన్న గ్రామస్తుల డిమాండ్‌ను సాకారం చేసినట్టు ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డీఎంకే శూలగిరి యూనియన్ కార్యదర్శి నరేశ్, లోకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ సమస్యపై గ్రామస్థుల ఫిర్యాదు

రాయచూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హట్టి బంగారు గనుల అనుబంధ కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న బ్లాస్టింగ్‌ల వల్ల తాము తీవ్ర అసౌకర్యాన్ని ఇబ్బందిని ఎదుర్కొంటున్నట్లు బుద్దిన్ని గ్రామస్థులు వాపోయారు. గతంలో గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసేందుకు బుధవారం సిరవార తహసీల్దార్ అశోక్ పవార్ గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల జరిగిన భారీ బ్లాస్టింగ్‌ల వల్ల గ్రామంలోని ఐదుకు పైగా ఇళ్లు బీటలు బారినట్లు గ్రామస్థులు వివరించగా వాటిని తహసీల్దార్ పరిశీలించారు. దీంతో పాటు గత కొన్నేళ్లగా సమీపంలోనే బ్లాస్టింగ్ జరుగుతూ పెద్ద ఎత్తున శబ్దాలు వస్తుండడంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇందుకు సంబంధించి సమస్యను గని అధికారులకు ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించినా ఇప్పటి వరకు చర్యలు లేవన్నారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఈ సందర్భంగా తహసీల్దార్‌కు ప్రజలు విన్నవించారు. దీంతో పాటు తమ గ్రామంలో నిరుద్యోగులకు బంగారు గనుల కంపెనీలో ఉపాది అవకాశాలు కల్పించాలని కోరారు.

రోడ్లపై మొక్కలు నాటి నిరసన



ఎజిల్ నగర్ ప్రధాన రహదారిపై మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న స్థానికులు

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు కూడా బురదమయంగా మారిందని, అయినా అధికారులు, నాయకుల్లో చలనం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణగిరి సమీపంలోని కల్లుకూరి పంచాయతీ పరిధిలోని చిన్నమేలుపల్లి, అన్నానగర్, పెత్తబేలుపల్లి గ్రామాలలో 2వేలమందికిపైగా ప్రజలు ఉన్నారు. కలెక్టర్ కార్యాలయం, ప్రాంతీయ రవాణా కార్యాలయం సహా వివిధ గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయమైంది. సుమారు ఐదారేళ్లగా రోడ్డును బాగు చేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రోడ్లను బాగు చేయాలని కోరుతూ గుంతలలో మొక్కలు నాటి నిరసన తెలిపారు. గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అయినా అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. బేగేపల్లి ప్రాంతంలోని ఎజిల్‌నగర్ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి సుమారు ఒక కిలోమీటరు మేర రోడ్డు దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాలతో బురదగా మారడంతో వాహన సంచారానికి తీవ్ర సమస్యగా మారింది. ఎంతోకాలంగా ఈ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాల మీదకు వస్తే పట్టణానికి పోయేదెలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



కల్లుకూరి వద్ద..